క్లుప్తంగా

24 నుంచి అధ్యయన ఉత్సవాలు

కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపల్లి సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు అధ్యయన భక్తోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 24న తొళక్కం, 25న సేవాకాలం, నమ్మాళ్వార్ పరమపదోత్సవం, 26న సీతారాముల కల్యాణోత్సవం , 27న పల్లకి సేవ ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

సన్మానం



ఈరమ్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

లింగాలఘణపురం: పదవీకాలం ముగిసిన క్లోం గ్రామ పంచాయతీ పాలక వర్గానికి ఆదివారం గ్రామస్తులు ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ తిప్పారపు ఈరమ్మతో పాటు మాజీ ఉపసర్పంచ్ మల్లేశం, వార్డు సభ్యులను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి వారు చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లావణ్యరమేష్, మబ్బు సత్యనారాయణ, శ్రీనువాసు, చంద్రయ్య, నర్సయ్య, ప్రసాద్, రాజు, నరేందర్ రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు..



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్‌లు

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన గుడిసెల రవి, బండ బాలరాజు, మర్రికింది రమేష్ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కాగా, వారిని జీపీ కార్యాలయం వద్ద మాజీ సర్పంచ్‌లు మూసిని సునీతరాజు, కోనేటి స్వామి ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో కేంగర్ల రవి, మూసిని భాను, పబ్బాల రాజు, ఎనుగుల శ్రీకాంత్, తమ్మడి రజినీ కాంత్, జిట్ట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆచూకీ లభ్యం



బాలికలతో మాట్లాడుతున్న సీఐ

జనగామ: పట్టణంలో ఆదివారం అదృశ్యమైన ఇద్దరు బాలికల ఆచూకీ లభ్యమైంది. సీఐ రఘుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గిర్నిగడ్డకు చెందిన దీకొండ లక్ష్మీనారాయణ కూతురు మేఘన (6వ తరగతి), మక్కెన వీరయ్య కూతురు భార్గవి (7వ తరగతి) ఇద్దరు ఏబీవీఈ ఎయిడెడ్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఇంట్లో గొడవ జరగడంతో ఆందోళన చెందిన భార్గవి స్నేహితురాలు మేఘనతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. కూతుళ్లు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి, బాలికల కోసం ఆరా తీస్తున్న సమయంలో వార్డులోని ఓ వాటర్ ప్లాంట్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నివాళి



రఘునాథపల్లి: ఫతేషాపూర్ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షుడు గడ్డం నర్సయ్య తల్లి బుచ్చమ్మ(59) ఆదివారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య సంఘం నాయకులతో ఫతేషాపూర్ చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో సంఘం మండల ప్రచార కార్యదర్శి సందుపట్ల సుధాకర్ నాయకులు గడ్డం మదార్, శాగ యాదగిరి, గడ్డం యాదగిరి, శ్రీహరి తదితరులు ఉన్నారు.

జాతర పనులు ముమ్మరం



ఇప్పగూడెం జాతర ప్రాంగణంలో ముస్తాబైన వనదేవతల గద్దెలు



చలువ పందిళ్ల పనులను పర్యవేక్షిస్తున్న ఎల్లాగౌడ్



తల్లుల గద్దెల వద్ద ముందస్తు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పగూడెం జాతర దేవాదాయ శాఖ పరిధిలో ఉండగా జాతర కమిటీ మాజీ అధ్యక్షుడు మందపురం ఎల్లాగౌడ్, ఉత్సవ కమిటీ బాధ్యులు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మునిగెల రమేష్ పర్యవేక్షణలో ముమ్మరంగా పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం జాతర ప్రాంగణంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు గద్దెలకు, ఎల్లమ్మగుడికి రంగులు వేయడం, వనదేవతల గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్లు, విద్యుత్, నీరు, లైటింగ్ తదితర పనులు చేపట్టారు. రెండు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశాలున్నాయని జాతర వద్ద వైద్య ఆరోగ్య సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

ముందస్తు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు..

సమ్మక్క–సారలమ్మ జాతర ఘట్టం ఈనెల 21 నుంచి ప్రారంభం కానుండగా ఆదివారం భక్తులు ముందస్తు మొక్కులు చెల్లిస్తున్నారు. ఇప్పటి నుంచి వివిధ గ్రామాల నుంచి భక్తులు పలు వాహనాల్లో తరలివస్తూ విడిది చేస్తున్నారు. కాగా, ఈ సారి జాతర వద్ద



జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రంగులరాట్నం

రంగులరాట్నం, జాయింట్ వీల్స్ ఏర్పాటు చేయగా ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. అదేవిధంగా మండలంలోని తాటికొండ, రంగరాయగూడెం సమ్మక్క–సారలమ్మ జాతర వద్ద చైర్మన్ కె.మహేందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా పనులు చేపడుతున్నారు.

మూడు రోజుల్లో పనులు పూర్తి

చిల్పూరు: లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తుల సౌకర్యాల కోసం పనులు మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఈఓ చిందం వంశీ తెలిపారు. ఆదివారం జాతర ప్రాంగణంలో క్యూలైన్ పనులను పరిశీలించిన అనంతరం జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ కండ్లకోలు బాలరాజు, వైస్ చైర్మన్ రావులపల్లి వెంకటేశ్వర్లులతో కలిసి మాట్లాడారు. జాతరలో ఉచిత దర్శనంతో పాటు రూ.100 టికెట్, వీఐపీల కోసం మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. కులసంఘాలు, ప్రజలు, కమిటీ బాధ్యులు జాతర విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కంకటి రాజన్న, వినోద్, గుంటిపల్లి వాజ్‌పేయ్, కర్ణాకర్, రచ్చ రవీందర్, కె.శ్రీనివాస్, అపరాదపు రాజు, తుత్తరు రాజు, గిరి, రాజుపాల్గొన్నారు.

అందరి సహకారంతో జాతర విజయవంతం చేస్తాం..

ఈనెల 21నుంచి 24 వరకు నిర్వహించే చిల్పూరు గట్టు (మల్బుగుట్ట) సమ్మక్క–సారలమ్మ జాతరను అందరి సహకారంతో విజయవతం చేస్తామని



చిల్పూరు: లింగంపల్లి జాతరలో పనులను పరిశీలిస్తున్న ఈఓ వంశీ

ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు అన్నారు. ఆదివారం జాతర ప్రాంగణంలో భక్తుల కోసం చేపట్టిన పనులను జాతర కమిటీ చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దాతలు, కమిటీ బాధ్యులు, ప్రజల ఆధ్వర్యంలో రెండోసారి నిర్వహిస్తున్న జాతరకు వనదేవతలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున మట్టి రోడ్లు, తదితర పనులు చేయిస్తున్నామన్నారు. చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, శివరాత్రి శేఖర్, జంగిటి లింగయ్య, నారగోని వెంకన్న, గణగోని రమేష్, శివరాత్రి వెంకటయ్య, కళకోల రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



దేవరుప్పుల: కడవెండి గ్రామ పంచాయతీ వద్ద ఆరె సామాజిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని నేడు(సోమవారం) ఉదయం 11 గంటలకు ఆవిష్కరించనున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధి దరగాని కోటేశ్వర్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శెట్టిపల్లి శివాజీ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేశ్వర్ తదితరులు రానున్నట్టు పేర్కొన్నారు. ఆరె సామాజిక వర్గానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

నేడు చెక్కుల పంపిణీ

బచ్చన్నపేట: మండల కేంద్రంలో నేడు (సోమవారం) కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు 172 కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల లబ్ధిదారులకు సమాచారం అందించామని, మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉదయం 11 గంటలకు లబ్ధిదారులు రావావాలని కోరారు.

ఆర్టీసీ సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేయండి

రఘునాథపల్లి: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా భక్తుల రాకపోకల కోసం రఘునాథపల్లి బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసుల పాయింట్ ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ పోకల శివకుమార్ ఆదివారం గ్రామ పెద్దలతో కలిసి జనగామ డిపో మెనేజర్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండలంలోని 36 గ్రామాల ప్రజలకు రఘునాథపల్లి నుంచి జాతరకు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉందన్నారు. గతంలో మాదిరిగా బస్టాండ్ వద్ద ఆర్టీసీ పాయింట్ ఏర్పాటు చేయాలని డీఎంకు విన్నవించినట్లు పేర్కొన్నారు. తమ వినతికి డీఎం సానుకూలంగా స్పందించి ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లి పాయింట్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపినట్లుగా ఆయన తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ యాదరాములు, గ్రామ పెద్దలు దుబ్బాక నాగేష్, పోరెడ్డి రాఘవరెడ్డి, రాములు, మురళి, యాకయ్య పాల్గొన్నారు.



డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న శివకుమార్ తదితరులు

చేయూత



తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రెయిన్‌బో యూత్ అసోసియేషన్ సభ్యులు చేయూతనందించారు. బండ వెంకటయ్య, రేణుక దంపతుల కూమార్తె కావేరి వివాహం ఆదివారం జరిగింది. కాగా, రెయిన్‌బో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు రూ.5,016 చెక్‌ను కావేరి తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో సభ్యులు మంచినీళ్ల రాజకుమార్, హరిప్రసాద్, రాజు, అక్తర్, తరుణ్, రాజకుమార్, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్ పాల్గొన్నారు.

మేడారం అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

జనగామ: దక్షిణాసియాలోని రెండో కుంభమేళాగా పేరుగాంచి రెండేళ్ల కోసారి జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను గిరిజన ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం నిర్వహించడానికి మోదీ ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, డోర్నకల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం ఆయనతో పాటు పలువురు నాయకులు మేడారంలో సమక్క–సారాలమ్మ తల్లులకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక–సారలక్క పేర్ల మీద గిరిజన యూనివర్సిటీతో పాటు ఆధ్యాత్మిక పర్యాటక రంగా అభివృద్ధి చెందేలా టూరిజం కారిడార్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.



మేడారంలో మొక్కులు చెల్లిస్తున్న బీరప్ప

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

పాలకుర్తి టౌన్: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎస్సై మోడం సాయి ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని ముత్తారం గ్రామంలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత ఆదివారం నిర్వహించారు. ప్రజలకు మూఢనమ్మకాలతో పాటు బాల్య వివాహాలు, మత్తు పానీయాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఎస్సై మాట్లాడుతూ నేరాల నివారణకు గ్రామాల్లో సీసీ కెమెరాలను గ్రామస్తులు.. ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. గూట్కా, గంజాయి, డ్రగ్స్ వల్ల యువకులు జీవితాలను నాశానం చేసుకుంటున్నారని వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలు జరిగినప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి కళా బృందం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి, కళా బృందం సభ్యులు వలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, పోలీసు సిబ్బంది డి.శ్రీనివాస్, భాస్కర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సాయిప్రసన్నకుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల బ్రిడ్జి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గణేష్ టౌన్ షిప్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న జనగామ పట్టణంలోని ధర్మకంచకు చెందిన సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సుధాకర్ ఎక్సెల్ వాహనంపై వస్తూ బ్రిడ్జి దిగి టౌన్‌షిప్ వైపు వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో కాలు విరిగింది. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

జనగామ రూరల్: మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొడకండ్ల: గౌడజన హక్కుల పోరాట సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం మండలకేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్మెట్ట శ్రీనివాస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. గౌడ కులస్తుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం నిరంతరం పనిచేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు సోమయ్య, నాయకులు శ్రీశైలం, దూలం సతీష్‌గౌడ్, నాగరాజు, చంద్రమౌళి, శేఖర్, మల్లయ్య, రాము, ఐల వెంకన్నగౌడ్, రమేష్, సైదులు, ఉపేందర్, సమ్మయ్య పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నర్మెట: సరుకులు అందజేస్తున్న నాయకులు



పాలకుర్తి: ఆర్థికసాయం అందజేస్తున్న టీచర్లు



బచ్చన్నపేట: ఎఫ్‌డీ అందజేస్తున్న స్నేహితులు

నర్మెట: మంలకేంద్రానికి చెందిన గద్దం లచ్చమ్మ, పులి ఎంకమ్మ, ఇరుగు నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, గంగం ట్రస్ట్ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి పార్టీ శ్రేణులతో కలసి బాధిత కుటంబాలను ఆదివారం పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. బండి అశోక్, భాగ్యమ్మ, ప్రజ్ఞాపురం శ్రీధర్, వీరారెడ్డి ,శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి..

పాలకుర్తి: మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన రామరాజు యాదగిరి ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తూ ఇటీవల హనుమకొండలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, ఆదివారం వల్మిడికి చెందిన ఉపాధ్యాయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 50 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దార్థ రవీందర్, వీరమల్ల బాబయ్య, దోకూరు రాజయ్య, దోకూరు సైదులు, వీరమల్ల రంజిత్, తండ మల్లయ్య, పోతుగంటి నర్సయ్య, కాసర్ల యాదగిరి, నీరటి వేణు, కొండ గణేష్, కూటికంటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన చెలుకుపల్లి కుమారస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఆదివారం చుక్కా రామయ్య ఫౌండేషన్ చైర్మన్ 25 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎ

మిత్రుడి కుటుంబానికి..

బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బాలగోని పర్శరాములు ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి పర్శరాములు ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు చేయూతనిచ్చారు. టెన్త్ బ్యాచ్ నిధి నుంచి మృతుడి కూతురు పవిత్ర పేరున బ్యాంకులో రూ. 50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. వెంకటేష్, కుమారస్వామి, శ్రీనివాస్, గణేష్, శ్రీనివాస్, సతీష్, శ్రీనివాస్, ఉపేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సిరిసిల్ల'ను కలిసిన రఘు



పాలకుర్తి టౌన్: టీఎస్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను ఆదివారం టీపీసీసీ సాంస్కృతిక శాఖ రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు కలిశారు. ఈ సందర్భంగా సిరిసిలకు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రాజయ్య రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులవడంపై హర్షం వ్యక్తం చేశారు.

రాజయ్యకు ఝాన్సీరెడ్డి శుభాకాంక్షలు



పాలకుర్తి టౌన్: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా రాజయ్యను నియమించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు



స్వాధీనం చేసుకున్న లిక్కర్‌తో పోలీసులు



తరిగొప్పుల: నర్సాపూర్‌లో..

జనగామ: పట్టణంలోని సంజయ్‌గనర చమన్ ఏరియాలో స్థానిక పోలీసులు ఆదివారం బెల్ట్ షాపులపై దాడులు చేశారు. ఓ బెల్ట్ షాపులో అక్రమంగా నిల్వ చేసిన రూ.17,700 విలువ చేసే 26 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు. బెల్ట్ షాపుల నిర్వహణపై నిరంతరం తనిఖీలు చేస్తామని, ఎవరూ కూడా అక్రమంగా అమ్మకాలు చేయరాదని సూచించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

తరిగొప్పుల: నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అయ్యల శ్వేత తెలిపారు. మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఇరుమల్ల కోతిలింగం బెల్టుషాపు నిర్వహిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో శనివారం రాత్రి తనిఖీ చేయగా బీరు, మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని పేర్కొన్నారు. సుమారు రూ.8,590 విలువైన 7 కేఎఫ్ స్ట్రాంగ్, 6 కేఎఫ్ లైట్ బీర్లు, 14 ఐబీ, 14 ఓసీ, 4 రాయల్ స్టాగ్ క్వాటర్లు, 1 ఐబీ ఫుల్ బాటిల్, 2 ఓసీ ఫుల్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాగా, సదరు బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ఎత్తు బంగారానికి భక్తుల సందడి

పాలకుర్తి టౌన్: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తుండడంతో ఆదివారం మండల కేంద్రంలోని భక్తులు ఎత్తు బంగారంతో మొక్కు చెల్లించుకునేందుకు కిరాణం షాపుల ఎదుట బారుల దీరుతున్నారు. ఎత్తు బంగారం చెల్లించుకునే భక్తులతో దుకాణాలు సందడిగా మారాయి.



ఎత్తు బంగారంతో షాపువద్ద భక్తులు